సాక్షి
అనంతపురం
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల చొప్పున ధర పలికాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.10 చొప్పున ధర పలికాయి. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
31.2°/20.7°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా నూతన కలెక్టర్‌గా ఆనంద్

- బాపట్ల కలెక్టర్‌గా వినోద్‌కుమార్ బదిలీ



నూతన కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ.ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కలెక్టర్‌గా ఉన్న వి.వినోద్‌కుమార్‌ను బాపట్ల కలెక్టర్‌గా నియమించారు. ఓ.ఆనంద్ ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆనంద్ గూడూరు సబ్ కలెక్టర్‌గా 2018 అక్టోబరు నుంచి 2019 ఆగస్టు వరకు పనిచేశారు. 2019 ఆగస్టు నుంచి 2022 ఏప్రిల్ వరకు పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2022 జూలై నుంచి 2022 అక్టోబరు వరకు పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేశారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు పార్వతీపురం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 జూలై వరకు విశాఖపట్నం వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. 2025 సెప్టెంబర్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.

బాపట్ల కలెక్టర్‌గా వినోద్‌కుమార్

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో ఇక్కడ కలెక్టర్‌గా ఉన్న ఎం.గౌతమిని బదిలీ చేస్తూ వినోద్‌కుమార్‌ను నియమించారు. 2024 ఏప్రిల్ 4వ తేదీన కలెక్టర్‌గా వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఏడాదిన్నర కాలం జిల్లాలో పనిచేశారు.

చిరుత దాడిలో గొర్రెలు మృతి



బ్రహ్మసముద్రం: చిరుతదాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండల పరిధిలోని కోనాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు... కోనాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఈశ్వరయ్య తన గొర్రెల మందను గురువారం మేపునకు తీసుకెళ్లాడు. కోనాపురం –గొల్లపల్లి గ్రామాల మధ్య ఓ పొలంలో గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. గమనించిన ఈశ్వరయ్య చిరుతను తరిమేందుకు ప్రయత్నించగా తిరగబడింది. ఈ క్రమంలోనే సమీపంలోని తోటికాపరులు కేకలు వేయడంతో చిరుత పరారైంది. చిరుత దాడిలో రెండు గొర్రెలు మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. దాదాపు రూ.30 వేల నష్టం వాటిల్లిందని చెప్పాడు.

డీఎఫ్‌ఓ విగ్నేష్ అప్పావు బదిలీ

అనంతపురం సెంట్రల్: జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా డీఎఫ్‌ఓ విగ్నేష్ అప్పావును ఎన్‌ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్) డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో జిల్లా అటవీశాఖ అధికారిగా ఎవరినీ నియమించలేదు. తాత్కాలికంగా శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్‌ఓ చక్రపాణికి అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి.

సూపర్ సిక్స్ సభకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సురేష్

బొమ్మనహాళ్: అనంతపురంలో బుధవారం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన సూపర్ సిక్స్ సభకు వెళ్లిన బొమ్మనహాళ్ మండలం కురువల్లి గ్రామానికి చెందిన సురేష్ కనిపించకుండా పోయాడు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం ఉదయం 10 గంటలకు టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బస్సులో అనంతపురానికి వెళ్లిన ఆయన.. తిరిగి ఇంటికి చేరుకోలేదు. గురువారం కూడా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులకు ఆందోళనతో బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ నబీరసూల్ మాట్లాడుతూ.. సురేష్ తప్పిపోయినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, అయితే అనంతపురం పరిధిలోని అంశం కావడంతో అక్కడి పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

కేసు పెట్టడం దుర్మార్గం



పత్రికా స్వేచ్ఛను హరించేలా కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తోంది. పోలీసులతో కేసులు పెట్టిస్తూ భయపెట్టాలని చూస్తోంది. ఇటీవల ఒక నాయకుడి ప్రెస్‌మీట్ కవర్ చేసినందుకు కేసు పెట్టడం దుర్మార్గం. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగేలా ప్రజాస్వామ్య విలువలకు భంగం వాటిల్లేలా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నా. – డాక్టర్ సాకే శైలజానాథ్, మాజీ మంత్రి



పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు తెలియజేసిన విషయాలను కూడా పేపర్లలో రాయడం నేరమనడం హాస్యాస్పదం. సాక్షిపై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు.
– మాలగుండ్ల శంకర నారాయణ, మాజీ మంత్రి

కాలవా.. కష్టాలు కానవా!

ఎమ్మెల్యే కాలవ ఇలాకాలో తారస్థాయికి యూరియా కష్టాలు

- రైస్‌బౌల్ ఆఫ్ అనంతపురంగా చెప్పుకునే 'దుర్గం'లో దారుణ పరిస్థితి
- ఎక్కడా యూరియా దొరక్క అల్లాడుతున్న రైతులు
- బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన టీడీపీ చోటా నాయకులు
- మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే దుస్థితి



బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్‌లోని గ్రోమోర్ దుకాణం వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలోనే అధికంగా వరిధాన్యం పండించే రాష్ట్రంగా రాష్ట్రానికి పేరు. అందుకే ఆంధ్రాను రైస్‌బౌల్ అంటారు. జిల్లాకు సంబంధించి రైస్‌బౌల్‌గా రాయదుర్గం నియోజకవర్గం పేరుగాంచింది. ఈ ప్రాంతంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో భారీగా వరిసాగు చేస్తారు. జిల్లా మొత్తంలో 40 శాతం వరి ఇక్కడే సాగవుతుంది.

ఈ కష్టాలు పగవాడికీ వద్దు..

వరి ఎక్కువగా పండించే బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు తారస్థాయికి చేరాయి. పక్షం రోజులుగా యూరియా దొరక్క అల్లాడుతున్నారు. ఉదయం నాలుగు గంటలకే రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల వద్దకు పోటెత్తుతున్నారు. వరి పైరుకు యూరియా వేయాల్సిన అదును ఇదే. వర్షం పడుతున్న సమయంలో యూరియా వేస్తే ఏపుగా పెరుగుతుంది. కానీ ఒక్క బస్తా యూరియా కోసం ఆరు గంటల పాటు క్యూలో నిల్చున్నా దొరకడం లేదు. దీంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. తమ కష్టాలు పగవాడికి కూడా రాకూడదంటూ వాపోతున్నారు.

ఒకటీ, రెండు బస్తాలే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులకు కావాల్సిన ఎరువుల కోసం ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి పంట సమయానికి అందించేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం రైతులకు సకాలంలో సరిపడా ఎరువులు అందించకుండా కష్టాలు పెడుతోంది. వచ్చిన అరకొర ఎరువుల కోసం రైతులు ఎగబడుతుండడంతో అధికారులు పోలీసుల భద్రత నడుమ పంపిణీ చేయాల్సిన దుస్థితి నెలకొంది. గురువారం బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, ఉంతకల్లు, లింగదహాళ్, దేవగిరి, శ్రీధరఘట్టలోని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల వద్ద యూరియా పంపిణీ జరుగుతున్న విషయం తెలుసుకున్న రైతులు భారీగా తరలివచ్చారు. అయితే, తగినంత యూరియా ఇవ్వకపోవడంతో ఆందోళన చేపట్టారు. వ్యవసాయ సిబ్బంది భద్రత కల్పించాలని ముందుగానే పోలీసులకు సమాచారమివ్వడంతో ఖాకీలు అక్కడికి చేరుకుని రైతులను క్యూలో నిలబెట్టి ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు బస్తాల యూరియా చొప్పున పంపిణీ చేశారు. కొందరికి ఆ మాత్రం కూడా అందలేదు. టీడీపీకి చెందిన నేతలకు మాత్రం 10 బస్తాలైనా ఇస్తున్నారని, సామాన్యులకు ఇవ్వడం లేదని పలువురు రైతులు వాపోవడం గమనార్హం.



ఉంతకల్లులో రైతు సేవా కేంద్రం వద్ద నిల్చోలేక చెప్పులను క్యూలో పెట్టిన రైతులు

రాయదుర్గం నియోజకవర్గంలో వరి సాగు ఇలా (ఎకరాల్లో)

హెచ్చెల్సీ అధికారిక ఆయకట్టు	30,000
అనధికారికంగా	15,000
బోర్లకింద	15,000

రైతుల కష్టాలు పట్టించుకోని ఎమ్మెల్యే..

తాము కష్టాలు పడుతున్నా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కనికరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 10న 'సూపర్‌సిక్స్–సూపర్‌హిట్' పేరిట అనంతపురంలో సీఎం సభ జరిగింది. ఈ సభ ఏర్పాట్లను చూసుకుంటూ వారం రోజులుగా ఎమ్మెల్యే కాలవ అనంతపురంలోనే ఉన్నారు. సభ ముగిశాక అంటే 11వ తేదీ కూడా సక్సెస్ మీట్ అంటూ నగరానికే పరిమితమయ్యారు. ఇదే సమయంలో ఆయన నియోజకవర్గంలోని రైతులేమో యూరియా దొరక్క అల్లాడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి దుస్థితి పట్టలేదని, ఇప్పుడెందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గంలోనే కాదు శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల్లోనూ రైతులను యూరియా కొరత వేధిస్తోంది. ఎమ్మెల్యేలు మాత్రం అనంతపురంలో ఉంటూ సక్సెస్‌మీట్‌లు అంటూ కాలంగడుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

యూరియా కోసం నిరసన



బెళుగుప్ప: నరసాపురం ఆర్‌ఎస్‌కే వద్ద నిరసన తెలుపుతున్న బ్రాహ్మణపల్లి గిరిజన తండా రైతులు

బెళుగుప్ప: మండల పరిధిలోని నరసాపురం గ్రామ పంచాయతీ బ్రాహ్మణపల్లి తండాకు చెందిన గిరిజన రైతులు తమకు యూరియా పంపిణీ చేయాలంటూ స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద గురువారం నిరసన చేపట్టారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లోనూ లభ్యం కావడం లేదని వాపోయారు. త్వరలోనే గిరిజన తండా రైతులకు యూరియా పంపిణీ చేస్తామని ఏఓ పేర్కొనడంతో వారు శాంతించారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం



పంటల సాగు కోసం వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. సకాలంలో యూరియా అందించపోతే మొక్క ఎదుగుదల లేక దిగుబడులు చేతికి అందే పరిస్థితి ఉండదు. నేడు, రేపు వస్తుందని అధికారులు చెబుతున్నారే కానీ యూరియా మాత్రం రైతులకు అందించడం లేదు. సూపర్ సిక్స్– సూపర్ హిట్ అంటూ సంబరాలు జరుపుకుంటున్న కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు రైతుల కష్టాలు కనబడడం లేదు.
– శంకరప్ప, రైతు, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ఒక్క బస్తా ఇస్తే ఎలా?



గత జగనన్న పాలనలో ఐదేళ్ల పాటు ఒక్క రైతూ యూరియా కోసం కష్టపడలేదు. కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా సరఫరా జరిగింది. ఇప్పుడేమో యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫర్టిలైజర్స్ దుకాణాలు, సొసైటీల వద్ద రాత్రింబవళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఎదురుచూస్తే ఒక్కో రైతుకు కేవలం ఒక్క బస్తా ఇచ్చి పంపుతున్నారు. ఇదేమి అని ప్రశ్నిస్తే యూరియా రాలేదు అంటున్నారు.
– రఘురామ్, రైతు ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

రైతులంటే ఇంత చులకనా?



రైతుల పట్ల ఇంత చులకన భావం పనికిరాదు. కూటమి సర్కార్‌కు ముందుచూపు కరువవడంతోనే యూరియా కష్టాలు ఉత్పన్నమవుతున్నాయి. లెక్కలు మాత్రం ఘనంగా చెబుతున్నా, యూరియా ఎక్కడికెళ్లిందో అర్థం కావడం లేదు. అవసరానికి తగ్గట్టుగా యూరియా సరఫరా చేయకపోతే రైతులతో కలసి ఎక్కడికక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తాం. రైతుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తాం.
– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

యల్లనూరులో కుండపోత



వజ్రకరూరు మండలం హోతూరు సమీపంలో నీట మునిగిన కంది పంట

- జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 47.6 మి.మీ వర్షపాతం
- 120 హెక్టార్లలో పంట నష్టం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. అత్యధికంగా యల్లనూరు మండలంలో 106.4 మి.మీ వర్షపాతం నమోదైంది. 31 మండలాల పరిధిలో ఒకే రోజు ఏకంగా 47.6 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. యల్లనూరు తర్వాత కణేకల్లు 94 మి.మీ, ఉరవకొండ 90.2, పామిడి 88.6, గుత్తి 86.2, విడపనకల్లు 79, రాప్తాడు 78.4, వజ్రకరూరు 77.8, గుంతకల్లు 74.2 మి.మీ భారీ వర్షం కురిసింది. అలాగే నార్పల 64.6 మి.మీ, పుట్లూరు 60.2, యాడికి 57.2, కళ్యాణదుర్గం 50.2, పెద్దవడుగూరు 47, బుక్కరాయసముద్రం 45, తాడిపత్రి 44.2, గార్లదిన్నె 43.4, డీ హీరేహాళ్ 37.2, అనంతపురం 36, పెద్దపప్పూరు 31.8, ఆత్మకూరు 30.2 మి.మీ నమోదైంది. మిగతా మండలాల్లో కూడా జడితో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గురువారం పగలంతా కూడా తేలికపాటి జడి కురిసింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 60.8 మి.మీ నమోదైంది. 22 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కాగా 19 మండలాల్లో సాధారణం కన్నా అధికంగానూ, 10 మండలాల్లో సాధారణం, రెండు మండలాల్లో మాత్రమే సాధారణం కన్నా తక్కువగా వర్షం కురిసింది. భారీ వర్షాలు కురిసిన తాడిపత్రి, ఉరవకొండ డివిజన్ల పరిధిలో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. జలపాతాలు కళ సంతరించుకున్నాయి.



వర్షాలకు కళ సంతరించుకున్న యాడికి మండలంలోని మరాడమ్మ జలపాతం

120 హెక్టార్లలో పంట నష్టం

భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా 120 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 100 హెక్టార్లలో వరి, వేరుశనగ దెబ్బతినడంతో రూ.25 లక్షలకు పైగా నష్టం జరిగిందన్నారు. టమాట, నర్సరీలు, ఇతర ఉద్యాన పంటలు 50 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- సుదీర్ఘంగా సీమను వంచించిన ఘనుడు
- అలాంటి వ్యక్తి రతనాల సీమ అంటే ప్రజలు ఎలా నమ్ముతారు
- జూనియర్ ఎన్‌టీఆర్ తల్లిని దూషించినా చర్యల్లేవ్
- ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ, పెనుకొండ వైద్య కళాశాల ప్రైవేటీకరణపై ప్రజాప్రతినిధులు మాట్లాడరా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: '47 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ఏనాడూ రాయలసీమకు న్యాయం చేయలేదు. విభజన హామీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే జీఓ తీసుకువచ్చి అడ్డుకున్నారు. హంద్రీ–నీవాను శంకుస్థాపనలకే పరిమితం చేసి సీమకు తీరని అన్యాయం చేశారు. అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవాను 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు చంద్రబాబు కుదించారని, 1995–2004 వరకు సీఎంగా ఉన్న ఆయన హంద్రీ–నీవా, గాలేరు నగరి పనులు కనీసం 50 శాతం పూర్తి చేసి ఉన్నా ఈ రోజున నికర జలాలు అందేవన్నారు.

వైఎస్సార్‌తోనే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ..

జిల్లా సస్యశ్యామలంగా ఉందంటే అది దివంగత నేత వైఎస్సార్ కృషితోనే సాధ్యమైందని, ఆయన హయాంలోనే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా మారిందని 'అనంత' చెప్పారు. వైఎస్సార్ హయాంలో హంద్రీ–నీవా ప్రాజెక్టును 40 టీఎంసీలుగా మార్చి 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. 2012 నుంచి జిల్లాకు హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. జీడిపల్లి, గొల్లపల్లి, శ్రీనివాసపురం, అడివిపల్లి రిజర్వాయర్లను నిర్మించిన ఘనత వైఎస్సార్ దేనని గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే చంద్రబాబు మాత్రం అనంతపురం సభలో నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడారన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క ప్రాజెక్ట్ రూపొందించి పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాలో బీటీపీ, పేరూరు, మడకశిర బ్రాంచ్ కెనాళ్లపై నిర్దిష్టమైన హామీని ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. హంద్రీ–నీవా లైనింగ్ పనులను ఆగమేఘాలపై పూర్తి చేసి జిల్లా రైతుల పొట్టకొట్టారన్నారు. ఆ వేగంతోనే జిల్లాలో నీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తానని ఎందుకు చెప్పలేకపోయారని నిలదీశారు.

జూనియర్ ఎన్‌టీఆర్ తల్లిని కించపరిస్తే మాట్లాడరా?

'మహిళలకు అన్యాయం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. కానీ, ఇటీవల స్వయానా ఆయన సోదరి, ఆయన శ్రీమతికి వదిన, దివంగత ఎన్‌టీఆర్ కోడలు, జూనియర్ ఎన్‌టీఆర్ తల్లిని వారి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కించపరిస్తే బాబు ఒక్క మాట మాట్లాడలేదు. ప్రశ్నిస్తే రైల్వే ట్రాక్‌పై పడుకోబెడతామని, అనుమతి లేకుండా నియోజకవర్గాల్లోకి అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించిన వారి గురించి కూడా ఎందుకు మాట్లాడలేదో చెప్పాలి' అని అనంత అన్నారు. 50 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ విషయంలో జిల్లాకు చెందిన ఒక్క ప్రజాప్రతినిధి మాట్లాడలేదని, పెనుకొండ వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేస్తున్నా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. పెనుకొండ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలోకి తీసుకొస్తున్న విషయంపై మంత్రి సవిత మాట్లాడకుండా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మేయర్ వసీం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, కార్పొరేటర్లు శ్రీనివాసులు, చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, జానీ, సాకే కుళ్లాయస్వామి, రామచంద్ర దితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు మార్కెటింగ్ వసతి కల్పిస్తాం

• రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు



బత్తాయి రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాప్తాడు: బత్తాయి, అరటి పంటలకు సరైన మార్కెటింగ్ వసతి, మెరుగైన ధర కల్పించి రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. రాప్తాడు మండలం మరూరులో గురువారం ఆయన పర్యటించి బత్తాయి, అరటి పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. బత్తాయి, అరటి పంటల సాగుకు రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని, ఈ క్రమంలో పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలాల్లోనే పంటను వదిలేయాల్సి వస్తోందన్నారు. బత్తాయి, అరటి రైతులకు మార్కెటింగ్ వసతితో పాటు మెరుగైన ధర కల్పిస్తామంటూ శ్రీనివాసులు భరోసానిచ్చారు. వివిధ ఉద్యాన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారులు ఉమాదేవి, చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ధనుంజయ, ఏడీ దేవానంద్, పాల్గొన్నారు.

చాబాలలో క్షుద్రపూజల కలకలం



చాబాల వద్ద క్షుద్రపూజలు చేసిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని చాబాలలో గురువారం క్షుద్రపూజల కలకలం రేగింది. గాలిమరలకు వెళ్లేదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. మధ్యాహ్నం అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు చూసి గ్రామస్తులకు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఏ పంట సాగు చేసినా నష్టాలు రైతును కుదిపేస్తున్నాయి. లాభాలు కనిపించడం లేదు. అప్పుల ఊబిలో రైతు కూరుకు పోతున్నాడు. ఈ క్రమంలో ప్రస్తుతం చీనీ రైతు కూడా చేరాడు. పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించిన అనంతరం ధర గిట్టుబాటు కాక యార్డులోనే వదిలేసి వెళుతున్నారు. ప్రస్తుతం అనంతపురం మార్కెట్‌యార్డులో ఎటు చూసినా రైతులు వదిలేసి వెళ్లిన చీనీకాయల కుప్పలు కనిపిస్తున్నాయి. గిట్టుబాటు కాక, కొనేవారు కరువై.. చీనీ రైతు కన్నీరు కారుస్తున్నా... కూటమి సర్కారు మాత్రం కరుణించే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులకు చీనీ రైతుల కష్టాలు.. కడగండ్ల గురించి పట్టించుకునే తీరిక లేకుండా పోయింది. దీనికి తోడు తమకు సంబంధం లేదన్నట్లుగా మార్కెటింగ్‌శాఖ, ఉద్యానశాఖ వ్యవహరిస్తున్నాయి.



అనంతపురం మార్కెట్ యార్డులో రైతులు వదిలి వెళ్లిన చీనీకాయలను డంప్ యార్డుకు తరలిస్తున్న దృశ్యం

నష్టాల ఊబిలో చీనీ రైతు

• మే, జూన్ మినహా ఏడాది పొడవునా గిట్టుబాటు కాని ధర
• టన్ను సగటున రూ.10 వేల మేర పతనం
• ధర గిట్టుబాటు కాక మార్కెట్‌లోనే వదిలి వెళుతున్న రైతులు

అనంతపురం అగ్రికల్చర్: చీనీ రైతులకు ఈ ఏడాది కలిసి రాలేదు. గతేడాది కూడా గిట్టుబాటు ధరలు లభించక చాలా మంది చీనీ రైతులు బాగా నష్టపోయారు. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా మారింది. మే–జూన్‌లో పరిస్థితి కొంత మెరుగ్గా కనిపించినా మిగిలిన 10 నెలలు రైతులకు నష్టాలే మిగిలాయి. ఇలా ఏడాదంతా చీనీ ధరలు పడిపోవడంతో జిల్లా రైతులు రూ.వందల కోట్ల నష్టాన్ని మూటగట్టుకున్నారు.



కొనేవారు లేక మార్కెట్‌యార్డులో ఎక్కడికక్కడ రైతులు వదిలేసిన చీనీకాయలు

దిక్కులు చూస్తూ..

నెల కాదు రెండు నెలలు కాదు ఏడాది పొడవునా సరైన ధరల్లేక చీనీ రైతులు దిక్కులు చూస్తున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జిల్లాలో 92 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఏడాదికి 5.20 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. ఏటా సగటున రూ.1,500 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అనంతపురం మార్కెట్‌యార్డు ద్వారానే ఏటా లక్ష మెట్రిక్ టన్నుల వరకు క్రయవిక్రయాలు సాగుతున్నాయి. మిగతావన్నీ తోటల నుంచి నేరుగా దళారులు, వ్యాపారులు కొనుగోలు చేసి ఢిల్లీ మార్కెట్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌యార్డులో కూడా రూ.10 కమీషన్ వసూలు చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక తోటల్లో అయితే డబుల్‌సూట్ (10 టన్నులకు రెండు టన్నులు కమీషన్), అంతకు మించి కొల్లగొడుతూ రైతులను కష్టాల్లోకి నెట్టేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

సగటున రూ.10 వేలు

ఇటీవల అనంతపురం మార్కెట్‌యార్డులో టన్ను సగటున రూ.10 వేలు ధర పలుకుతోంది. నాలుగైదు లాట్లు మాత్రమే రూ.15 వేలు ప్రకారం అమ్ముడుబోతుండగా మిగతావన్నీ రూ.10 వేలు, ఇంకొన్ని రూ.7 వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ధరలు గిట్టుబాటు కాక రైతులు భారీగా నష్టపోతున్నారు. ఎకరా చీనీ తోటకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెడుతుండగా... టన్ను రూ.10 వేలు పలికితే పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదంటున్నారు. టన్ను కనీసం రూ.30 వేల నుంచి రూ.40 వేలు అమ్ముడుబోతే కానీ రైతులకు గిట్టుబాటు కాదంటున్నారు. ఈ ఏడాది మే, జూన్‌లో మాత్రమే గరిష్ఠంగా టన్ను రూ.40 వేలు పలికింది. మధ్య మధ్యలో ఓ పది రోజులు పాటు కొంత మెరుగైన ధర లభించడం మినహా ఏడాది పొడవునా రూ.10 వేల నుంచి రూ.15 వేల మధ్యనే నడిచింది.

సీపీఎస్ రద్దు చేయాలి

తాడిపత్రిటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ ఏపీటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ మోసాన్ని నిరసిస్తూ తాడిపత్రిలోని పురపాలక పాఠశాలలో గురువారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీని నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. యాప్‌లను, అసెస్మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు జయచంద్ర, సుధాకర్ రావు, రంగనాథ, లీలావతి, మల్లికార్జున, ఉపేంద్రం, జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి ప్రకాశం హైస్కూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

వివాహిత ఆత్మహత్య

• భర్త వేధింపులే కారణం

రాయదుర్గం టౌన్: మండలంలోని పల్లేపల్లికి చెందిన వివాహిత చాముండి(22) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పల్లేపల్లిలో నివాసముంటున్న నాగమ్మకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు కాగా, రెండో కుమార్తె చాముండికి ఏడాదిన్నర క్రితం కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడుకు చెందిన చిరంజీవితో వివాహమైంది. చిన్నపాటి విషయానికి భార్యతో గొడవపడేవాడు. అనుమానంతో ఆమెను వేధింపులకు గురిచేస్తుండేవాడు. ప్రస్తుతం చాముండి నాలుగు నెలల గర్భిణి. అనారోగ్యంతో బాధపడుతున్న తన అక్కను చూసేందుకు పది రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. అనంతరం రెండు రోజుల క్రితం భర్త అత్తింటికి చేరుకున్నాడు. బుధవారం రాత్రి దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. అనుమానంతో ఆమెను దూషించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన చాముండి అర్ధ రాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



చాముండి మృతదేహం

'సూపర్ ఎస్కేప్' అయ్యారు

• ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



ఉరవకొండ: సీఎం చంద్రబాబు బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్ సభలో అవాస్తవాలతో ప్రజలను మభ్య పెట్టి సూపర్ ఎస్కేప్ అయ్యారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 50 సంవత్సరాల వాళ్లకు పింఛన్ లేదు, వికలాంగుల పింఛన్ తొలగించటం, అర్హత గల కొత్త పింఛన్‌లు మంజూరు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత సంవత్సరం 66.34 లక్షలు ఉన్న పింఛన్లను 6192లక్షలకు తగ్గించారన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారులకు ఇప్పటికీ వారి ఖాతాలో నగదు జమ కాలేదని, ఆడ బిడ్డ నిధి లేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదని ప్రభుత్వానికి గుర్తు చేశారు. రెండు నెలలుగా యూరియా కోసం రైతులు నానాయాతలు పడుతున్నా పట్టించుకోకుండా సంబరాలు నిర్వహించుకోవడం సిగ్గు చేటన్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: విశ్వకర్మ యోజన కింద అందించే రుణాలకు ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్ మైనార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చేతివృత్తిదారులు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, శిల్ప కళాకారులు, కొలిమి.. బుట్టలు.. చాపలు.. పరకలు అల్లేవారు, చెప్పులు కుట్టేవారు, రజక, కుమ్మరి, టైలర్లు, తాపీ కార్మికులు, బార్బర్లు, రాళ్లు కొట్టువారు, బొమ్మలు, పూలదండలు, తాళాలు తయారీదారులు అర్హులు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తారు. రుణాలు పొందిన వారు 5 శాతం వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గత ఐదేళ్లలో పీఎంఈజీపీ, సీఎం స్వానిధి, ముద్రా రుణాలు పొందిన వారికి ఈ పథకం వర్తించదు. www.pmvishwakarma.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

గుత్తి కొండను కమ్మేసిన పొగమంచు



గుత్తి కొండపై మంచు తెరలు వీడుతున్న దృశ్యం

గుత్తి: పొగ మంచు చుట్టేయడంతో గురువారం ఉదయం గుత్తి కొండ కనిపించకుండా పోయింది. జనాలు ఎంతో ఆసక్తిగా ఈ దృశ్యాన్ని తిలకించారు. ఓ వైపు వర్షం, మరో వైపు మంచు కారణంగా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

నేడు జిల్లాకు 1,130 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: 'వెంటాడుతున్న యూరియా కష్టాలు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ స్పందించారు. కోటా మేరకు కంపెనీల నుంచి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇఫ్కో కంపెనీ నుంచి శుక్రవారం 1,130 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరనుందన్నారు. మార్క్‌ఫెడ్‌కు 580 మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 220 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 330 మెట్రిక్ టన్నులు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌కేల్లో 420 మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 93 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 678 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆర్‌ఎస్‌కేల పరిధిలో భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 30,156 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

• ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు ధారదత్తం చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను రాష్ట్ర ప్రభుత్వం దూరం చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గిరి, కార్యదర్శి ఓతూరు పరమేష్ మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం అనంతపురంలోని టవర్‌క్లాక్ కూడలిలో విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలంలో విద్యారంగంలో నెలకొన్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. దీనికి తోడు కొత్త సమస్యలను సృష్టించడమే లక్ష్యంగా కూటమి సర్కారు పాలన సాగిస్తోందన్నారు. నీట్ విధానం తమ రాష్ట్రానికి వద్దంటూ తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసుకుని కేంద్రంతో పోరాటం సాగిస్తుంటే ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం నీట్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగించకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి శివ, నాగభూషణ, సోము, విజయ్, జయ, శశి కుమార్, సాయి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బస్సును ఢీకొన్న కారు



దెబ్బతిన్న కారు

బుక్కరాయసముద్రం: మండలంలోని బాట్లో కొత్తపల్లి గ్రామం సమీపంలో నిలబడి ఉన్న బస్సును కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. శింగనమల మండలం తరిమెల పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న అక్తర్‌జాన్, మరో ఉపాధ్యాయుడు, అదే మండలంలోని ఆనందరావు పేట పాఠశాలలో పని చేస్తున్న మరో ఇద్దరు ఉపాధ్యాయులు కారులో పాఠశాలకు వెళుతుండగా లోలూరు వద్ద నిలబడి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో అత్తర్‌జాన్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరు ఉపాధ్యాయులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

• సాంఘిక సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి సంబంధించి విద్యార్థుల వివరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించాలంటే విద్యార్థుల వివరాలను వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు, సచివాలయ సిబ్బంది విద్యార్థుల వివరాలను వెంటనే జ్ఞానభూమి లాగిన్‌లో నమోదు చేయాలన్నారు.

చాంపియన్ షిప్ దక్కించుకున్న మధ్యప్రదేశ్ జట్టు



విజేతగా నిలిచిన మధ్యప్రదేశ్ జట్టు

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–19 ఇన్విటేషన్ కప్ క్రికెట్ టోర్నీ చాంపియన్‌షిప్‌ను మధ్యప్రదేశ్ జట్టు దక్కించుకుంది. బరోడా జట్టు రన్నరప్‌గా నిలిచింది. గురువారం జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన మధ్యప్రదేశ్ జట్టును విజేతగా నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ భారత క్రికెటర్ జాకబ్ మార్టిన్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, కోచ్‌లు చిన్నబాబు, పి.శర్మాస్‌వలి, కె.నరేష్, ఆర్.కుమార్, కె.ఇనాయతుల్లా, ఆర్.ప్రవీణ్, భార్గవ్, శంకర్ ధావన్ తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ ఆడుతుండగా గొడవ

• ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: క్యారమ్ బోర్డు ఆడుతూ గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొని ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన కంబయ్య, రాజు, సుధాకర్ గ్రామ శివారులోని టీ కేఫ్ వద్ద రోజూ చెట్నేపల్లికి చెందిన మౌలి, రాజేష్, రామాంజి, బాలు, రమేష్, శేఖర్‌తో కలసి క్యారమ్ బోర్డు ఆడేవారు. ఈ క్రమంలో గురువారం కాయిన్ వేసే విషయంలో గొడవ చోటు చేసుకుంది. చెట్నేపల్లి యువకులు సోడా సీసాలు, రాళ్లు, కర్రలతో దాడులు చేయగా బసినేపల్లి కంబయ్య, రాజు, సుధాకర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కంబయ్యను మెరుగైన చికిత్స కోసం స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



గాయపడిన రాజు, సుధాకర్

చింతలరాయుడి హుండీ ఆదాయం రూ.8.75 లక్షలు

తాడిపత్రి రూరల్: స్థానిక చింతల వేంకటరమణ స్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. గత ఏడాది నవంబర్ 28 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు హుండీ ద్వారా రూ.8,75,824 భక్తులు కానుకల రూపంలో అందజేసినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

జాతీయ స్థాయి వర్సిటీ పోటీల్లో సత్తా చాటాలి

• స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశంలో జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం: దక్షిణ భారతదేశ అంతర వర్సిటీ, జాతీయ స్థాయి పోటీల్లో జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులు సత్తా చాటాలని ఆ వర్సిటీ వీసీ హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ (ఏ)లో గురువారం నిర్వహించిన 16వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ క్రీడలను నిర్వహించే కాలేజీలను ,క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలను స్పోర్ట్స్ కౌన్సిల్‌కు వివరించారు. జాతీయ, దక్షిణ భారత అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వర్సిటీ తరపున తగిన ఆర్థిక చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డీఏపీ ఎస్వీ సత్యనారాయణ, డీఈ వి.నాగప్రసాదనాయుడు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ టి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

• జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి సెప్టెంబర్‌లోనే ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్యానల్ రూపొందించిన నేపథ్యంలో గిరిజమ్మతో పాటు సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బయ్యను జెడ్పీ ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, శ్రీవాణి, షబ్బీర్ నియాజ్, మహబూబ్ వలి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజమ్మను కలిసిన పీఆర్ ఎస్ఈ

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను పంచాయతీరాజ్ రాయలసీమ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్(ఎస్ఈ) వై.చిన్నసుబ్బరాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడులో పని చేస్తూ పదోన్నతిపై అనంతపురం ఎస్ఈగా వచ్చిన ఆయన.. జిల్లా పరిషత్ కార్యాలయంలోని చాంబర్‌లో చైర్‌పర్సన్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనకు గిరిజమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సబ్ డివిజన్–1, 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి పాల్గొన్నారు.



బోయ గిరిజమ్మను సన్మానిస్తున్న ఉద్యోగులు

జక్కల ఆదిశేషుకు కన్నీటి వీడ్కోలు

తనకల్లు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జక్కల ఆదిశేషు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామం బొంతలపల్లిలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కాగా, బొంతలపల్లికి గురువారం కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ చేరుకుని జక్కల ఆదిశేషు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కల ఆదిశేషు భార్య జెడ్పీటీసీ సభ్యురాలు జక్కల జ్యోతి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ ఎమ్మెల్యేలు దేశాయి తిప్పారెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్తఫా, పలువురు జిల్లా నాయకులు, మండల కమిటీ సభ్యులు తదితరులు జక్కల ఆదిశేషు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'అనంత' నేతల నివాళి

జక్కల ఆదిశేషు మృతదేహాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, పార్టీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, అనంతపురం జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు అమరనాథరెడ్డి, గౌడ్‌సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కల లక్ష్మీనరసింహగౌడ్, బీసీ సంఘం ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, కదిరి సాయి, జై గౌడ రాష్ట్ర నాయకులు రాజ్‌కుమార్, వాల్మీకి అంజి, పవన్, బెస్త వెంకటేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, తదితరులు

క్లుప్తంగా

ఆటోమేషన్‌తో మానవ తప్పిదాలను తగ్గించొచ్చు



మాట్లాడుతున్న చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: లైట్లు, ఫ్యాన్లు, కార్లు, వ్యవసాయ పరికరాలు, ఆరోగ్య పరికరాలు మొదలైన వాటిని ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేసి డేటాను పంపడం ద్వారా శ్రమ, మానవ తప్పిదాలను తగ్గించవచ్చని స్థానిక ఎస్వీ డిగ్రీ పీజీ కళాశాల వైస్ చర్మన్ సి.చక్రధర రెడ్డి తెలిపారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో కర్ణాటకకు చెందిన ఆర్ లాజిక్ టెక్నాలజీస్ సహకారంతో మూడురోజుల పాటు జరుగుతున్న 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వర్క్‌షాప్' గురువారం ముగిసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె. జగదీష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'సూపర్' ఫెయిల్యూర్

అనంతపురం కార్పొరేషన్: 'సూపర్‌సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమం కాదని అది సూపర్ ఫెయిల్యూర్ అని యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండానే అమలు చేశామంటూ డబ్బా కొట్టుకోవడం సీఎం చంద్రబాబు అండ్ కోకు పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వం అందించిన కొన్ని పథకాల్లోనూ అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రజలన్నీ చూస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

మాదిగలపై నిర్లక్ష్య వైఖరి తగదు

- ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

అనంతపురం రూరల్: మాదిగల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇదే వైఖరి కొనసాగిస్తే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సాకే హరి కలిసి కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చర్మశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి మాదిగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సబ్సిడీ రుణాల కోసం దాదాపు రూ. 340 కోట్లు కేటాయించామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందని, ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. జేఏసీ నాయకులు రామకృష్ణ, సూర్యనారాయణ, నరేంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో అమరావతి క్వాంటం వాలీ హ్యాకథాన్-2025 సెమీ ఫైనల్ పోటీలు గురువారం నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరై క్వాంటం టెక్నాలజీ గురించి వివరించారు. ఈ పోటీల్లో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, వర్సిటీ క్యాంపస్ కళాశాలలు రెండు జట్ల చొప్పున పాల్గొన్నారు. మొత్తం పది విభాగాలకు సంబంధించి క్వాంటం టెక్నిక్స్‌ను, అల్గారిథమ్స్‌ను ప్రదర్శించారు. ప్రతి విభాగం నుంచి మొదటి, రెండో స్థానం పొందిన జట్లు అమరావతిలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటాయి.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

అనంతపురం కార్పొరేషన్: ముగ్గురు ముస్లిం మైనార్టీ కుటుంబాల పిల్లల వివాహాలకు గరీబ్ కా దర్ద్ ట్రస్టు ద్వారా మేయర్ వసీం గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ట్రస్టు వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్టు సభ్యులను ఆదర్శంగా తీసుకుని ముస్లిం మైనార్టీలు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇసాక్, నాయకులు జిలాన్, మసూద్‌ఖాన్, సాదిక్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా



అనంతపురం మెడికల్: మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు రావడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజారోగ్యం కోసం పాటుపడే వారికి సకాలంలో వేతనాలు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి కార్మికులకు వేతనాలు ఇప్పించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సేవలు గగనం.. ప్రత్యక్ష నరకం

2 డీ ఎకో కోసం రోగులకు అవస్థలు

- వారంలో మూడు రోజులే సేవలు
- ఆక్సిజన్‌పై 2 డీ ఎకో కోసం వస్తున్న వైనం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 2 డీ ఎకో సేవలు పొందడం గగనమవుతోంది. ప్రస్తుత రోజుల్లో ఏదైనా శస్త్రచికిత్స చేయాలన్నా గుండె సంబంధిత సమస్యలున్నా టూడీ ఎకో అనివార్యమవుతోంది. దీంతో ఆస్పత్రిలోని గైనిక్, లేబర్‌లోని గర్భిణులు, బాలింతలు, సర్జికల్, మెడిసిన్, తదితర వార్డుల్లో అడ్మిషన్‌లో ఉన్న వృద్ధులు, మహిళలు విధిగా 2 డీ ఎకో చేసుకోవాల్సి వస్తోంది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వారంలో సోమవారం, గురువారం, శనివారం మాత్రమే టూడీ ఎకో సేవలుంటాయి. ఈ రోజుల్లో దాదాపుగా 150 మందికి టూడీ ఎకో చేయాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి లేదు. వాస్తవంగా 2డీ ఎకో కార్డియాలజీ లేని పక్షంలో శిక్షణ పొందిన టెక్నీషియన్లు చేయాలి. ఇక్కడ ఒక్క టెక్నీషియన్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిలేకుండా ఉన్న క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లకు 2డీ ఎకో శిక్షణ అందించి, వారి ద్వారా ఆస్పత్రిలో రౌండ్ ద క్లాక్ 2 డీ ఎకో సేవలందించే ప్రయత్నమైనా సర్వజనాస్పత్రి అధికారులు చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా ఆస్పత్రి అధికారులు చొరవ చూపడం లేదు.



ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని స్ట్రెచర్‌పైనే ఉంచి 2డీ ఎకో చేస్తున్న దృశ్యం



2డీ ఎకో కోసం ఆక్సిజన్‌పై రోగిని తీసుకెళ్తున్న దృశ్యం



ఆస్పత్రిలో 2డీ ఎకో పరీక్ష కోసం స్ట్రెచర్‌పై వేచి ఉన్న రోగులు

గదికే పరిమితమైన సూపరింటెండెంట్..

సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం తన గదికే పరిమితమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చార్జ్ తీసుకున్నప్పటి నుంచి వార్డుల్లో పర్యటించలేదు. అత్యంత కీలకమైన గైనిక్, లేబర్, రోగులకు సేవలందించే ఎక్స్‌రే, ఆల్ట్రాసౌండ్, సిటీ, ఎంఆర్ఐ స్కాన్, 2డీ ఎకో తదితర వాటిని పరిశీలించాల్సి ఉంది. ఇప్పటికైనా సూపరింటెండెంట్ మేలుకుని రోగులకందే సేవల్లో నాణ్యత పెంచుతారో లేదో చూడాలి.

కనీసం ప్రోటోకాల్ పాటించరా?

- మండిపడ్డ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సభ్యులు

రాప్తాడు రూరల్: 'ఎమ్మెల్యేకు ఎలాగైతే ఓట్లు వేసి గెలిపించారో, తమను కూడా అదే రీతిలో ఓట్లు వేసి ప్రజలు గెలిపించారు. అధికారుల దృష్టిలో ఎమ్మెల్యే ఒక్కరే ప్రజాప్రతినిధా? మేము కాదా?' అని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి, సభ్యులు అధికారులను నిలదీశారు. గురువారం అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయ ఉద్యోగులు ఇటీవల మండలంలోని ప్రతి పంచాయతీలోనూ సమావేశాలు ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలపై ప్రజలతో అర్జీలు తీసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వలేదు. ఏహోదా లేని టీడీపీ కార్యకర్తలు పార్టీ కండువాలు వేసుకుని ప్రజలతో అర్జీలు తీసుకున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏహోదా లేని వారిని వేదికలపై ఎలా కూర్చోబెడతారని నిలదీశారు. గ్రామాల్లో యూరియా పంపిణీ సమాచారం వ్యవసాయ అధికారి కనీసం చెప్పలేదన్నారు. ఆయన ఎప్పుడు వచ్చారో...మండలంలో ఏయే కార్యక్రమాలు చేస్తున్నారో కనీస సమాచారం లేదన్నారు. ఇదేనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం అని మండిపడ్డారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ దివాకర్ వివరించారు. కార్యక్రమం ఏర్పాటు చేయడంలో తప్పు లేదని ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని తప్పు పడుతున్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులకు తీవ్ర అవమానం కల్గించారన్నారు. టీడీపీ కార్యకర్తలతో స్కూళ్లు, సచివాలయాల వద్ద జాతీయ జెండాలు ఆవిష్కరించారన్నారు. ఇదేనా అధికారులు పాటించే ప్రోటోకాల్ అని మండిపడ్డారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. విచారిస్తామని, ఇలాంటి పొరబాట్లు మరోమారు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వివరణ ఇచ్చారు. వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చియ్యేడు ఉన్నత పాఠశాలలో అన్ని వసతులతో పాటు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉన్నారన్నారు. అయినా ఇటీవల పదో తరగతి ఫలితాల్లో చాలా వెనుకబడి ఉందన్నారు. ఇందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఎంఈఓను అడిగారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్

అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే విఫలం

- మేయర్ వసీం ధ్వజం

అనంతపురం కార్పొరేషన్: అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, నడిమివంకకు ప్రొటెక్షన్ వాల్ అంటూ ఎన్నికల ముందు హామీలు గుప్పించిన దగ్గుపాటి ప్రసాద్ ఎమ్మెల్యే అయ్యాక నేడు వాటి ఊసే ఎత్తకుండా నగరాభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని మేయర్ వసీం ధ్వజమెత్తారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయం ఆవరణంలో విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా సూపర్ హిట్ అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు సంబరాలు చేసుకోడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బడుగులకు 50 ఏళ్లకు పింఛన్ తదితర హామీలను ఎక్కడ అమలు చేశారో సీఎం చంద్రబాబు అండ్ కో చెప్పాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంలోనూ అర్హులకు అన్యాయం చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే 'అనంత' చొరవతో నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి చేతనైతే గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిలో సగం చేసి చూపించాలన్నారు. అభివృద్ధికి అడ్డుపడడం సరికాదన్నారు. సమావేశంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, పార్టీ నాయకులు చింతకుంట మధు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

కేరళ కాన్క్లేవ్‌కు మేయర్..

కేరళలోని కొచ్చిన్‌లో జరిగే కాన్క్లేవ్ 2025కు నగర మేయర్ వసీంకు ఆహ్వానం అందింది. గురువారం ఆయన కేరళకు బయలుదేరారు. ఈ నెల 12, 13 తేదీల్లో కేరళ అర్బన్ పాలసీ-ఆకాంక్షించే నగరాలు.. అభివృద్ధి చెందుతున్న సమాజాలు అనే అంశంపై వివిధ ప్రాంతాల మేయర్లతో సమావేశం జరగనుంది. అందులో మేయర్ మాట్లాడనున్నారు. ఇటువంటి అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని మేయర్ పేర్కొన్నారు.

టపాసుల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయానికి సంబంధించిన లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ కేశవనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం ఏఈ-5 లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. www. peso.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉందన్నారు. దరఖాస్తుతో పాటు నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, 5 పాస్‌ఫొటోలతో పాటు రూ. 500 చలానా చెల్లించాలన్నారు. ఈ నెల 30లోపు నాలుగు సెట్ల దరఖాస్తులను ఆర్డీఓ కార్యాలయంలో అందించాలన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల విచారణ అనంతరం జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్‌ఓసీ అందించిన వారికి తాత్కాలిక లైసెన్స్‌లు అందిస్తామని తెలిపారు.

బాబుకి జిల్లా అభివృద్ధి పట్టదా?

అనంతపురం టవర్‌క్లాక్: 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభలో అనంతపురం జిల్లా అభివృద్ధికి సంబంధించి సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్ విమర్శించారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం జిల్లాకు ఏదైనా ప్రకటిస్తారని ప్రజలు ఎదురు చూశారన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా బాధితురాలిని ఏ ఒక్క నాయకుడు పరామర్శించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థిని అతి కిరాతకంగా హత్య చేసినా బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. నాయకులు ఆనంద్, మల్లికార్జున నాయక్, ముసలయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సులపై శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: 'ఉన్నతి ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సులపై నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయి ఉండాలన్నారు. 18 నుంచి 28 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి బెంగళూరులో 35 రోజుల పాటు కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ లాంటి అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. వివరాలకు 9000487423లో సంప్రదించాలని సూచించారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

- జేడీఏకు రైతు సంఘం, సీఐటీయూ నేతల వినతి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో యూరియా కొరత లేకుండా తగినంత నిల్వలు రైతులకు అందుబాటులో ఉంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. యూరియా సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి... గ్రామంలో చాటింపు వేసి రైతులకు సజావుగా పంపిణీ చేయాలన్నారు. ఎరువుల పంపిణీలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించాలన్నారు. యూరియా అమ్మకాలపై నిఘా ఉంచి సరిహద్దు దాటకుండా కట్టడి చేయాలని కోరారు. ఈ సీజన్‌లో యూరియా సరఫరా, అమ్మకాలపై సమగ్ర విచారణ చేపట్టి అవినీతి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జేడీఏకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు ఓబుళు, చంద్రశేఖర్‌రెడ్డి

హమాలీలకు కూలీ రేట్లు పెంచాలి

అనంతపురం అర్బన్: హమాలీలకు సిమెంట్ అన్‌లోడింగ్ కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. కూలీ రేట్లు పెంచాలంటూ గురువారం స్థానిక గుత్తిరోడ్డులోని డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సిమెంట్ గోడౌన్ వద్ద హమాలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ బయటివారితో అన్‌లోడింగ్ చేయిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కూలీ రేట్లు పెంచేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు అక్బర్, నారాయణ, రాము, ధనుంజయ, బాబు, నరసింహులు, శ్రీరాములు, పీరా, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

అనంతపురం మెడికల్: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రపంచ ఆత్మహత్య నివారణ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. మొదటగా భయాన్ని వీడాలన్నారు. మానసిక ఒత్తిళ్లకు లోనుకాకుండా యోగా, ధ్యానంతో పాటు వీలున్నప్పుడు క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ వరదరాజులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి'పై శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: పొలంబడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్-గ్యాప్) తెలియజేయాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఏడీఏలు, పలువురు ఏవోలకు గ్యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 14 వారాల పాటు నిర్వహించే పొలంబడిని రైతులకు ఉపయోగపడేలా... తక్కువ పెట్టుబడులు, మేలైన యాజమాన్య పద్ధతులు వారు పండించిన నాణ్యమైన పంట ఉత్పత్తులకు మంచి ధరలు లభించేలా రైతులను నిష్ణాతులను చేయాలని సూచించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) ద్వారా విత్తన ధృవీకరణ పత్రం (సర్టిఫికేషన్) అందించే చర్యలు తీసుకుంటామన్నారు. సర్టిఫికేషన్ కలిగిన పంట ఉత్పత్తులకు మంచి ధరలు లభిస్తాయని తెలిపారు. పొలంబడిని ఆషామాషీగా కాకుండా పక్కా ప్రణాళికతో విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనరేట్ ఏడీఏ వెంకటేశ్వర్లు, విత్తన ధృవీకరణ అధికారి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

రేపటి బదులు మరోరోజు పని చేస్తాం

- విద్యాశాఖ అధికారులకు వైఎస్సార్‌టీఏ, పీఆర్టీయూ వినతి

అనంతపురం ఎడ్యుకేషన్: రెండో శనివారం (రేపు) బదులుగా మరోరోజు పని చేసేందుకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్, పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారన్నారు. బదులుగా రెండో శనివారం (రేపు) పని చేయాలని డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రెండో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు సెలవులు రావడంతో అవసరాలు, పిల్లలు చదువుకుంటున్న వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు చాలామంది టీచర్లు అప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. బస్సులు, రైళ్ల రిజర్వేషన్లు కూడా చేసుకున్నారన్నారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత పనులను దృష్టిలో ఉంచుకుని రెండో శనివారం సెలవు ప్రకటించి అందుకు బదులుగా మరోరోజు పని చేస్తామని ఇందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్. నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, వెంకటరమణ, గోపాల్, రామకృష్ణ, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.తిమ్మారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లప్ప, వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

14న ఏఎన్నార్ జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రామ్స్ క్లాసిక్ నిర్వాహకులు రామాంజి, జీవీ రామయ్య తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో జరిగే అక్కినేని సంగీతోత్సవానికి కళాభిమానులు విచ్చేయాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరాలయం నూతన కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: వందేళ్ల చరిత్ర కల్గిన పురాతన మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయానికి ప్రభుత్వం నూతన కమిటీని నియమించింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా నరేంద్ర చౌదరి, కార్యనిర్వాహక సభ్యులుగా రాజు, బోయ వెంకటరమణమ్మ, దేవరకొండ రత్నమ్మ, వనితబాయి, చరణ్‌తేజ్, ఆదిశేషయ్య, బన్యాల రాధ, అనంతకుమారిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ నాగేంద్రుడు తెలిపారు. కమిటీలో సీనియర్ అర్చకుడు కిషోర్‌కుమార్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉంటారని, మరో ఇద్దరు సభ్యులు విష్ణువర్ధన్, శ్రీదేవితో కలిసి త్వరలోనే వీరు బాధ్యతలు తీసుకుంటారని ఈఓ వెల్లడించారు.

మాదిగల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం రూరల్: వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాదిగల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కలసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా ఎల్లన్న మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారన్నారు. ఇంటర్, డిగ్రీలు చదివినా ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందించి ఆర్థిక భరోసా అందించాలన్నారు. భూములు కొనుగోలు చేసి దళితలకు ఇవ్వాలన్నారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ

అనంతపురం రూరల్: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండలో నిర్వహించిన జిల్లా స్థాయి సెపక్ తక్రా అండర్-14 పోటీల్లో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని స్కూల్ సిబ్బంది అభినందించారు. అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

పరామర్శ

రామగిరి: మండలంలోని పేరూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచుకుంట హనుమంతు సతీమణి గౌరమ్మ (40) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మణికంఠ, గుడుసాల ఈశ్వరయ్య, గుడుసాల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

15న జీపు వేలం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం జీపును వేలం వేయనున్నట్లు ప్రాజెక్టు అధికారిణి కవితాదేవి తెలిపారు. 15వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు చెన్నేకొత్తపల్లిలోని ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తామన్నారు. రూ.3 వేలను చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.